గుంతల రోడ్లతో అవస్థలు


లింగమయ్య స్వామి గుడి సమీపంలో బీటీరోడ్డుపై ఏర్పడ్డ గుంతలు


డిండి ప్రాజెక్టు మెయిన్ కెనాల్ వంతెన వద్ద దెబ్బతిన్న రోడ్డు

- డిండి నుంచి దేవరకొండ వెళ్లే బీటీరోడ్డుపై ఏర్పడ్డ గుంతలు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు

డిండి : డిండి నుండి దేవరకొండ వెళ్లే బీటీ రోడ్డు గుంతల మయంగా మారడంతో ప్రమాదకరంగా మారింది. దాదాపు గడిచిన మూడేళ్ల కాల వ్యవధిలో కురిసిన వర్షాలకు బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలు, డిండి ప్రాజెక్టు మెయిన్ ఎడవ కాల్వకు నీటిని వదలడంతో ఊట ద్వారా వచ్చే నీటితో గుంతలు నిండి బావులను తలపించేలా మారాయి. దీంతో ఈ రోడ్డు మార్గం గుండా వాహనాల్లో ప్రయాణించే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని ప్రయాణికులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని 38 గ్రామపంచాయితీల ప్రజలు సరుకుల కొనుగోలు విషయం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం డిండి పట్టణానికి వస్తుంటారు. ఈ క్రమంలో ప్రయాణికులు పలుమార్లు ప్రమాదానికి గురైన ఘటనలు చోటు చేసుకున్నా రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంపై సంబంధితాధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదపుటంచునా ప్రయాణికులు

నల్గొండ, కోదాడ, మిర్యాలగూడ, దేవరకొండ తదితర డిపోల నుంచి డిండి మీదుగా అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కర్నూల్, శ్రీశైలానికి నిత్యం వందల సంఖ్యలో నడిచే ఆర్టీసీ బస్సుల్లో వేల సంఖ్యలో ప్రయాణికులు తమ రాకపోకలు కొనసాగిస్తుంటారు. ముఖ్యంగా ఈ మార్గంలోని లింగమయ్య స్వామి గుడి, డిండి ప్రాజెక్టు మెయిన్ కెనాల్ వంతెన వద్ద, పట్వారి తూం సమీపంలోనున్న రోడ్డు మధ్యలో లోతుగాగుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనం, ఆటోలు నడిపే డ్రైవర్లు ఏ పాటి ఆదమరిచినా పెద్ద ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికుల వాపోతున్నారు. డిండి నుండి గోనకొల్ గ్రామ శివారు వరకు నూతనగా బీటీరోడ్డు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా సంబదితాధికారులు వెంటనే స్పందించి నూతన బీటీ రోడ్డు వేసేంత వరకు ప్రమాదకరంగా మారిన గుంతలను మట్టితోనైనా పూడ్చి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భయాందోళనకు గురవుతున్నాం



డిండి నుంచి దేవరకొండ వెళ్లే రోడ్డుమార్గంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలతో వాహనాలు నడిపే క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోలన చెందుతున్నాం. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– హబీబ్, లారీ డ్రైవర్, డిండి

రోడ్డు పనులు ప్రారంభించాలి

మండల కేంద్రం నుంచి గోనకోల్ గ్రామ శివారు వరకు నూతన బీటీరోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించాలి. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి. ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం.

– జవహర్, జేత్యతండా

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

పెద్దవూర : గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ ఏపీపీడీ నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల వారిగా ఏయే పనులు చేపట్టారు. ఎంత ఖర్చు చేశారో సామాజిక తనిఖీ బృందాలు ప్రతి పనికి సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. మండలంలో ఆర్థిక సంవత్సరంలో రూ.5,96,09,629 ల పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. గత నెల 28వ తేదీ నుంచి నేటి వరకు మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఉపాధి హామీ పనులపై సమీక్షించినట్లు పేర్కొన్నారు. పనులు జరిగిన ప్రదేశాల్లో పనులకు సంబంధించి నేమ్ బోర్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. చాలా గ్రామాల్లో చేసిన పనులకు, కొలతలకు చాలా తేడాలు ఉన్నట్లు, కొలతలు వేయకుండానే చెల్లింపులు జరిపారని సభ దృష్టికి తీసుకువచ్చారు. మస్టర్ ముగిశాక కూడా చెల్లింపులు జరిపినట్లు, కొన్ని గ్రామాల్లో ఎంబీలు కాకున్నా చెల్లింపులు చేశారని తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది గ్రామాల్లో చేపట్టే పనుల్లో పారదర్శకంగా వ్యవహరించి పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అహ్మద్ హఫీజ్, జిల్లా విజిలెన్స్ అధికారి వేణుగోపాల్‌రావు, అంబుడ్స్‌మెన్ అధికారిణి గౌరి, అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, ఏపీఓ యాట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కన్నెకల్‌లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేములపల్లి(మాడుగులపల్లి): ప్రజలు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు మాధవకుమార్ అన్నారు. ఆదివారం మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ గ్రామంలో ప్రజలు విష జ్వరాలతో బాధపడుతుండడంతో వైద్య శిబిరం నిర్వహించి మాట్లాడారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రోగులకు రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటితోపాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కిరిబాయి, భవాని, జోసఫ్, జ్యోతిక, ఏఎన్ఎం నాగలక్ష్మీ, రోజా ఆశలు మంగమ్మ, లక్ష్మీ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంతో మరొకరి జీవితంలో వెలుగు


కుమారుడి అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులను సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

మిర్యాలగూడ : మరణించిన వారి అవయవాలను దానం చేసినట్లయితే మరొకరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని వాసవీ క్లబ్ ఐపీసీ మిట్టపల్లి విజయ భాస్కర్‌రావు అన్నారు. పట్టణానికి చెందిన బంటు మహేష్ ఇటీవల బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందగా తల్లిదండ్రులు బంటు వెంకటేశ్వర్లు, మీనాక్షిలు తన కుమారుడు అవయవాలను దానం చేయడంపై వారిని ఆదివారం శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రావు మాట్లాడుతూ బంటు మహేష్ అవయవాలు దానం చేయడం వల్ల అతను మరణించి జీవిస్తూనే ఉన్నారన్నారు. వాసవీక్లబ్ విజ్ఞప్తి మేరకు మహేష్ మృతిచెందిన సందర్భంలో కుటుంబసభ్యులు దుఖంలో ఉన్నప్పటికీ అవయవాలు దానం చేయడం గొప్ప విషయమన్నారు. అవయవదానం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గిరీష్ జీవన్, మణిపాల్, సామ శ్రీనివాస్, మందాలపు శ్రీనివాస్, గట్టు వెంకటేశ్వర్లు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం దుబ్బతండా గ్రామ పంచాయతీలో విద్యుదాఘాతంతో పాడి గేదె ఆదివారం సాయంత్రం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ సమీపంలో గల దుబ్బతండా గ్రామంలో ధనావత్ తార్యకు చెందిన పాడి గేదే రోజు మాదిరిగానే సాయంత్రం గ్రామ సమీపంలో మేతకు వెళ్లింది. దీంతో శ్రీనివాస్‌నగర్‌కు చెందిన పాండయ్య పొలంలో మేత మేస్తుండగా పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ హెర్త్ తీగ కిందకు వేలాడుతుండటంతో ప్రమాదవశాత్ ఎర్త్ తీగకు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీంతో ఈ గేదే విలువ సుమారు 70వేల నుంచి 80 వేల రూపాయలకు పైగా ఉంటుందని బాధితుడు తార్య తనకు ఆధారమైన పాడి గేదే మృతి చెందినందున న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరాడు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దేవరకొండ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్క చోట కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమతో పాటు చదువుకున్న విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంజి యాదేశ్వరి, నామని విజయ, పగడిమర్రి ధనలక్ష్మీ, వనం నాగమణి, పుష్పలత, దీప, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ నియోజకవర్గంలో మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ లు మాట్లాడుతూ.. మహిళా డిగ్రీ కళాశాల లేనందున, మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి చదవలేక మధ్యలోనే తమ చదువులు ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలకు నిధులు కేటాయించి విద్యను బలోపేతం చేసి ఉచిత నిర్బంధ విద్యను పేద విద్యార్థులకు అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరన్న, సంపత్, ప్రసన్న, వైష్ణవి, తరుణ్, సిపాయి, రాజు, దత్తు, శ్రీకాంత్ తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


వేములపల్లి : మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


పెద్దవూర : గోవిందరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

వేములపల్లి (మాడుగులపల్లి): మాడుగులపల్లి మండలంలోని కల్వలపాలెం గ్రామానికి చెందిన తిరుగుడు వెంకన్నయాదవ్ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పరామర్శించారు. అదేవిధంగా పాములపాడు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు బంటు సైదులు తండ్రి బంటు జానయ్య మృతిచెందగా ఆయన కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన సీతా కళమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందగా కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి మాట్లాడారు. ఆయన వెంట మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, మాజీ సర్పంచ్ యాతం లక్ష్మీనరేందర్‌రెడ్డి, నాయకులు జానయ్య, పానుగోటి చొక్కారావు, మోహన్‌రావు, జగన్, సైదులు, నరేష్, అంజయ్య, దిలీప్, గిరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి గోవిందరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆదివారం మృతుడి స్వగ్రామానికి చేరుకుని పార్థీవ దేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బైకాని లక్ష్మయ్య, సైదయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు సహకారం అందిస్తా

మిర్యాలగూడ : సమాజ సేవకు తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని బీఎల్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బత్తుల ప్రసన్నకుమార్ అన్నారు. అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో వెల్నెల్ బై హార్ట్ ఫుల్‌నెస్ శ్రీరామచంద్ర మిషన్ సంస్థ పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, యోగా శిక్ష, ఉచిత వైద్య శిబిరాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రసన్నకుమార్

శ్రీ సాయిదత్తా ఆశ్రమంలో లక్ష నామార్చనలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రైల్వే కాలనీలోని శ్రీసాయిదత్తాశ్రమంలో ఆదివారం శ్రీసాయికి లక్ష నామార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం తెల్లవారు ఝూము నుంచి హారతితో ప్రారంభించి శ్రీ నాగసాయి విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అంతర్జాతీయ షిర్డీ భక్త సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్షణామార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ పరిసరాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాలతో పాటు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుండా శ్రీనివాస్, కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు ప్రతాప్, మట్టయ్య, సోమయ్య, జగన్నాధరావు, జానకి రాముడు, రవి, నాగన్న, విక్రం, వెంకన్న, విజయ్, అంజిబాబు పాల్గొన్నారు.

నల్లగొండలో టెక్నో తలాన్ పరీక్ష

నల్లగొండ రూరల్: గౌహతి ఐఐటీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండలోని వివిధ పాఠశాలల్లో టెక్నో తలాన్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు రాశారు. గౌహతి ఐఐటి విద్యార్థులు ఇలాంటి టాలెంట్ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని ఆయా పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పరీక్షల్లో నిర్వాహకులు ప్రవీణ్, నాగార్జున పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు ఎంపీ రఘువీర్‌రెడ్డి దేవరకొండకు రాక

దేవరకొండ : ఈనెల 16న దేవరకొండ నియోజకవర్గానికి నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి రానున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని నేరేడుగొమ్ము మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి మొదటిసారి దేవరకొండ నియోజకవర్గానికి రానున్నారని, నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు కేజీబీవీ భవనం ప్రారంభం

చందంపేట : నేరెడుగొమ్ము మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని (కేజీబీవీ) మంగళవారం నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌లు ప్రారంభించనున్నట్లు నేరెడుగొమ్ము మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో బిక్కునాయక్, ముక్కమల వెంకటయ్య, లోకసాని కృష్ణయ్య, బాలునాయక్ ఉన్నారు.

వర్షాలు కురవాలని పూజలు

చింతపల్లి : మండల పరిధిలోని హరిజనాపురంలో వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ ఆదివారం గ్రామస్తులు గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించడంతో పాటు కప్ప కాముడు నిర్వహించారు. వర్షాలు లేక పంటలు వాడుపడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఇద్దయ్య, కృష్ణయ్య, చిరంజీవి, నాగేష్, సురేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

జంకుతండాలో సీత్లా పండుగ


సీత్లా పండుగలో పాల్గొన్న మహిళలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం జంకుతండాలో ఆదివారం సీత్లా పండుగను గిరిజనులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పశు సంపదలు, గ్రామం పచ్చగా ఉండాలని గిరిజనులు ఏడు శీతల దేవతలను మొక్కి తమ కోరికలు తీర్చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆరు నెలల చిన్నారి బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రిత్విక శీతల పండుగ రోజు నైవేద్యం సమర్పిస్తూ పలువురిని ఆశ్చర్యపరిచింది. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజనులు, యువకులు, యువతులు తదితరులున్నారు.

కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 16న నిర్వహించనున్న సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎండీ సయ్యద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీపీఐ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు. అదే విధంగా ఈనెల 21 మిర్యాలగూడ, 22న దామరచర్ల, 24న వేములపల్లి మండలాల నిర్మాణ సమావేశాలు జరుగుతాయని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశాలకు సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని మల్లెలగట్టు కాలనీలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ వ్యకాస ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సువాసిని, నాగమ్మ, గిరి, వెంకటయ్య పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ ప్రెసిడెంట్ నాగిళ్ల మురళికి సన్మానం

నల్లగొండ టౌన్: టీఎన్‌జీవోస్ ప్రెసిడెంట్ నాగిళ్ల మురళిని ఆదివారం చాకలి ఐలమ్మ సంక్షేమ భవన్‌లో రజక సంఘం నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి కష్టపడిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆకునూరు లక్ష్మీ, బీమనపల్లి దుర్గయ్య, దశరథ, సత్యనారాయణ, సైదులు, శ్రీనివాస్, విజయ్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢమాస బోనాల మహోత్సవం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణం మర్రిగూడలోని కల్యాణ కనకదుర్గ దేవాలయంలో ఆషాఢ మాస బోనాల మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మర్రిగూడ నుంచి దేవాలయం వరకు భజన మేళతాళాలతో పోతరాజుల విన్యాసాలతో మహిళలు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. శాకంబరీ దేవి అలంకరణ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జెరిపోతుల సైదులు గౌడ్, కమిటీ సభ్యులు జెరిపోతుల పద్మ, శ్రీ దుర్గా, జెరిపోతుల కార్తీక్ గౌడ్, అర్చకులు పర్వతం రామకృష్ణచార్యులు, తిరందాసు శ్రవణ్, మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలి


తైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ

నల్లగొండ టూటౌన్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న జిల్లాకు చెందిన క్రీడాకారులు విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ విజయ భాయి అన్నారు. నల్లగొండ పట్టణంలోని తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల బాలికలకు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం ద్వారా బాల బాలికలకు శారీర ఆరోగ్యంతో పాటు ఆత్మ రక్షణ కూడా ఉంటుందన్నారు. క్రీడా పోటీల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సన్ లైట్ తైక్వాండో అకాడమీ జిల్లా కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు మణికుమార్ రెడ్డి, సహాయ కార్యదర్శి రమేష్, కోశాధికారి సమరసింహారెడ్డి, పూర్ణ చందు, కరుణాకర్,మనోజ్, కృతికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీలగిరిలో పోలీసుల తనిఖీలు


వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ

నల్లగొండ క్రైం: నల్లగొండలో పోలీసులు శనివారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 14 టీమ్‌లుగా ఏర్పడిన పోలీస్ బృందం సరైన ఆధారాలు లేని వాహనాలను పట్టుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేశారు. వంద మంది యువకులు పట్టణ శివారులో మద్యం సేవిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించి మరోసారి బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో యువతకు కౌన్సిలింగ్ ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆకస్మిక తనిఖీలు చేస్తామని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?


కంపచెట్లతో మూసుకుపోయిన కొప్పోలు- నడికూడ రోడ్డు

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు నడికూడ గ్రామాల మధ్య కంపచెట్లు మూసుకుపోయి రహదారి అధ్వానంగా మారింది. ఎనిమిది కిలోమీటర్ల ఈ రోడ్డు పూర్తిగా కంకర తేలి పాదచారులు కూడ నడవలేనంతగా మారింది. 15ఏళ్ల క్రితం తారు రోడ్డు వేసినా ఇంతవరకు మరమ్మతులకు నోచుకోలేదు. హాలియాకు ఈ రోడ్డు ద్వారా నిత్యం ప్రయాణాలు సాగుతున్నా కనీస మరమ్మతులు కూడా పట్టించుకోవడం లేదు. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులకు చలనం లేదని కాంగ్రెస్ నాయకులు గంగాధర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కంపచెట్లను ఆర్అండ్‌బీ సిబ్బందితో తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.